క్లుప్తంగా

పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

మునగాల : బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓబీసీ వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలైన భూమి, ఇల్లు, ఉపాధి, విద్య, వైద్యం అందించాలని ధర్మ సమాజ్ పార్టీ మునగాల మండల అధ్యక్షుడు పిడమర్తి నరేష్ కోరారు. ఈ మేరకు బుధవారం మునగాల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పేదల నైపుణ్యాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలన్నారు. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు, ఎకరం భూమి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పూలే సాహు మహరాజ్, డాక్టర్ అంబేడ్కర్, కాన్షీరామ్ పేర్లు పెట్టి ఐదు పథకాలను పేద వర్గాలకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పిడమర్తి ఏసు, పతకుంట్ల వెంకటేష్, చిర్ర వంశీ, ఎం.మహేష్ పాల్గొన్నారు.

24న గౌడ సంఘం కార్తీక వన భోజనాలు



వన భోజన మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం సభ్యులు

చిలుకూరు : మండల కేంద్రంలో ఈ నెల 24వ తేదీన గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబోయే కార్తీక వన భోజన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం బాధ్యులు కోరారు. ఈమేరకు బుధవారం చిలుకూరులో ఉత్సవ ఆహ్వాన పత్రికను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్తీక వన భోజన ఉత్సవంలో గౌడ కుటుంబసభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ సభ్యులు అమరగాని కాశయ్య, గుండు వెంకటేశ్వర్లు, మండవ ఉపేందర్, కొండా కోటయ్య, కొండా వెంకయ్య, మండవ వీరబాబు, మరీదు సైదులు, అంబాల రాంబాబు, కోల గురుస్వామి, కాసాని దశరథ, మల్లం వెంకటేశ్వర్లు, మేకపోతుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షను జయప్రదం చేయాలి

మునగాల : దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, బోధ వ్యాధిగ్రస్తులకు పెన్షన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ఈనెల 18 నుంచి 23 వరకు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలో పింఛన్‌దారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధికార ప్రతినిధి పేరెల్లి బాబు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గురువారం కోదాడ నియోజకవర్గ పెన్షన్‌దారులు ఈ రిలే నిరాహారదీక్షలో పాల్గొనాలని కోరారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ.2,016 పింఛన్‌ను రూ.4,016, రూ.4.016 పింఛన్‌ను రూ.6,016లకు పెంచాలనే డిమాండ్‌తో ఈరిలే నిరాహార దీక్ష చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

టీఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక


అధ్యక్ష, వర్కింగ్ ప్రెసిడెంట్‌ను సన్మానిస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

మఠంపల్లి : మండల కేంద్రంలో బుధవారం టీఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావూరి విజయభాస్కర్‌మాదిగ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కాటిపల్లి మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూరాకుల నరసయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని శాలువాతో ఘనంగా సన్మానించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ దైదా రాయలు, దేవపంగు ప్రసాద్, వస్కుల జయరాజు, సందీప్, నాగరాజు, మట్టయ్య, వీరస్వామి, సైదులు, అంజి, గోపయ్య, తిరుపయ్య పాల్గొన్నారు.

ఆలయ పూజారిపై చర్యలు తీసుకోవాలి

మునగాల : మండలంలోని నర్సింహాపురంలో గల శ్రీకోదండరామస్వామి పురాతన ఆలయ పూజారి శేషాచార్యులుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గుండు మధుసూదన్‌రావు బుధవారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత కొంతకాలంగా పూజారి ఆలయ ఆచారాలు పాటించడం లేదని, ఉత్సవాలతో సహా విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని, పూజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. శేషాచార్యులును తక్షణమే తొలగించి మరో అర్చకుడిని నియమించాలని అధికారులను కోరినట్లు తెలిపారు.

ముమ్మరంగా వరి కోతలు

- మరో వారం రోజుల్లో పూర్తి
- తాటాకు తెగులు ప్రభావంతో తగ్గిన పంట దిగుబడి
- ఎకరాకు 35 బస్తాల లోపే..


నడిగూడెంలో వరి పంట కోస్తున్న యంత్రం

నడిగూడెం : మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కూలీల కొరతతో రైతులు కోత మిషన్ల సహాయంతో పంట కోసే పనుల్లో నిమగ్నమయ్యారు. నడిగూడెం మండల కేంద్రంతో పాటు బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, వెంకట్రాంపురం, కరివిరాల గ్రామాల్లో బోర్లు, బావులు, చెరువుల కింద, చాకిరాల, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, ఎకలాస్‌ఖాన్‌పేట తండా, తెల్లబల్లి, రత్నవరం, శ్రీరంగాపురం, వల్లాపురం, సిరిపురం గ్రామాల్లో సాగర్ ఎడమ కాల్వకు అనుబంధంగా ఉన్న కొమరబండ మేజర్, కొత్తగూడెం మేజర్, పాలారం మేజర్ కాల్వల కింద, నారాయణపురం, కాగితరామచంద్రాపురం గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలు, బావులు, బోర్ల కింద దాదాపు 15 వేల ఎకరాలకు పైగా వరి సాగు చేపట్టారు. మరో వారం రోజుల్లో వరి కోతలు పూర్తి కానున్నాయి.

వరి కోత యంత్రాలకు డిమాండ్.

మండల వ్యాప్తంగా వరి కోతల పనులకు వ్యవసాయ కూలీల కొరత తీవ్రంగా ఉంది. దీంతో రైతాంగం వరి కోతల యంత్రాలపై ఆధారపడుతుండడంతో యంత్రాలకు డిమాండ్ పెరిగింది. కరీంనగర్, తమిళనాడు నుంచి పలువురు ఏజెంట్లు వరి కోత యంత్రాలను తీసుకొచ్చి ఇక్కడ నడుపుతున్నారు. టైర్ మిషన్ గంటకు రూ.2500, ట్రాక్ యంత్రం గంటకు రూ.3200 నుంచి 3500 వరకు కోత కోసినందుకు తీసుకుంటున్నారు.

తగ్గిన పంట దిగుబడి..

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో వరికి తీవ్రంగా తాటాకు తెగులు సోకింది. దీంతో ఒక ఎకరానికి 30 నుంచి 35 బస్తాల వరకు మాత్రమే పంట దిగుబడులు వస్తున్నాయని రైతులు అంటున్నారు. ప్రధానంగా తాటాకు తెగులు ఆశించడంతో పంట దిగుబడులు తగ్గాయని, ఇష్టారాజ్యంగా రసాయన పురుగు మందులు వాడడం వలన పెట్టుబడులు పెరిగాయని పలువురు రైతులు చెబుతున్నారు. మండలంలో చింటు, హెచ్‌ఎంటీ, బీపీటీ-5204 వంటి రకాలు సాగు చేశారు.

పంట దిగుబడి తగ్గింది


గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో వరికి తాటాకు తెగులు సోకింది. అనేక రకాల మందులు పిచికారీ చేసినా తెగుళ్ల అదుపులోకి రాలేదు. దీంతో పంట దిగుబడులు తగ్గాయి. ఎకరానికి 30 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చింది. పెట్టుబడులు మాత్రం బాగా పెరిగాయి.

– మారిశెట్టి నర్సింహారావు, రైతు, రామాపురం

1న మాలల సింహ గర్జన సభ


కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ దగ్గుపాటి బాబురావు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సింహగర్జన కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక టౌన్ హాల్‌లో నిర్వహించిన మాలల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తుంటే చూస్తూ ఊరుకోమని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు రాములు, వేణు, బలరాం, నాగయ్య, రవి, జ్ఞానయ్య, నరసింహారావు, రాములు, పున్నయ్య, కోటమ్మ, అంతోని, రాంబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేస్తా


వంగవేటి రామారావును సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

మునగాల : సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన వంగవేటి రామారావును బుధవారం మునగాల మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్, మండల కాంగ్రెస్ కమిటీ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ వంగవేటి వెంకట గురుమూర్తి, ఆర్యవైశ్య ప్రముఖులు అర్వపల్లి శంకర్, చిల్లంచర్ల ప్రభాకర్, ఎల్‌వీ.ప్రసాద్, నల్లపాటి నాగేశ్వరరావు, ఓరుగంటి రవి, చక్కా కిశోర్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కాపర్తి మణికంఠ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి ప్రవీణ్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, సీతారాములు, కాంగ్రెస్ నాయకులు జానకి రెడ్డి, యుగంధర్‌రెడ్డి, నరసింహారావు, గ్రంథాలయాధికారిణి లలితాదేవి, సిబ్బంది శ్రీను పాల్గొన్నారు.

మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు


బరాఖత్‌గూడెంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

మునగాల : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తహసీల్దార్ వి.ఆంజనేయులు అన్నారు. మునగాల మండలంలోని బరాఖత్‌గూడెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2.320 తో పాటు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. ధాన్యం అమ్మిన మూడు రోజుల్లోనే రైతులకు నగదు ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రేష్మ, పీఏసీఎస్ సీఈఓ బసవయ్య, కేంద్రం ఇన్‌చార్జ్ గోపి పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య, ప్రధాన కార్యదర్శి గుంటిక కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. ఈనెల 26న తలపెట్టిన నిరసన కార్యక్రమ కరపత్రాన్ని బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 26వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో చేపట్టబోయే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, యరగాని గురువయ్య, పి.రామరాజుయాదవ్, ఎం.ముక్కంటి, సీహెచ్.రాము, ముస్తాఫా, సావిత్రి, గడ్డం వెంకటమ్మ, కె.రవీందర్, శ్రీనివాస్, వెంకన్న, నాగేందర్, సైదా, వీరయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేరమ్మయాడి ఉత్సవం


సంబరాల్లో పాల్గొన్న గిరిజన నాయకులు, మహిళలు

మఠంపల్లి : కార్తీక మాసం సందర్భంగా మఠంపల్లి మండలంలోని రామచంద్రాపురం తండాలో గిరిజనుల ఆరాధ్యదైవం మేరమ్మయాడి ఉత్సవాలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, పీఏసీఎస్ మండల చైర్మన్, వైస్ చైర్మన్‌లు రామచంద్రయ్య, బాబునాయక్, మాజీ ఎంపీపీ చోక్లానాయక్, మాజీ సర్పంచ్ బుజ్జిభీముడునాయక్, మాజీ ఉపసర్పంచ్ నాగునాయక్, నవీన్‌నాయక్, భాస్కర్‌నాయక్, తులిశానాయక్, నరసింహారావు, చిన్నానాయక్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో మాలధారులకు అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప ఆలయం ఆవరణలో గల అన్నదాన వితరణ కేంద్రంలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 170 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీను గురుస్వామి తెలిపారు. ఈ అన్నదానానికి బాగం వెంకటనారాయణ -మహేశ్వరి దంపతులు (మునగాల), కొమ్ము బుచ్చిబాబు జ్ఞాపకార్థం భార్య జ్యోతి, కూతురు వైష్ణవి సహకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దాతలు గురుస్వాములు తంగెళ్ల సాంబస్వామి, కొమ్ము ఈదారావు, అయ్యప్పమాలధారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ టౌన్- 1 ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్నందున పట్టణంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రాంప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని దద్దనాల చెరువు కాలనీ, మల్లన్న నగర్, వెంకట నగర్, టీచర్స్ కాలనీ ఎన్‌జీఓస్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నడిగూడెం, కరివిరాలలో..

నడిగూడెం : నడిగూడెం, కరివిరాల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించనున్నందున ఆయా గ్రామాల్లో గురువారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ కె.సైదయ్య బుధవారం ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేషన్ కార్డులు లేక ఇబ్బందులు

మఠంపల్లి : అర్హులకు ప్రభుత్వం రేషన్ కార్డులను తక్షణమే మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం మఠంపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేషన్ కార్డులు లేక ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి పున్నయ్య ఉన్నారు.

కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర


కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : దేశంలో త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మతతత్వ భావాలను వ్యతిరేకించే వారందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు దేవరం మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి, నాయకులు జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, జడ వెంకన్న, మామిడి నరసయ్య, జక్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

హుజూర్‌నగర్ : సూర్యాపేటలో ఈనెల 29న నిర్వహించబోయే సీపీఎం జిల్లా తృతీయ మహా సభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. ఈమేరకు మంగళవారం హుజూర్‌నగర్‌లో కరపత్రం ఆవిష్కరించి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరయ్య, వెంకన్న, తిరుపయ్య, అక్కమ్మ, సావిత్రి, మిన్నమ్మ, సుభద్ర, మట్టమ్మ, ప్రియాంక, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నాయకుల ముందస్తు అరెస్ట్

నేరేడుచర్ల : కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో గిరిజన రైతులపై జరిగిన దాడిని ఖండిస్తూ హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగే గిరిజన సంఘాల సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన గిరిజనులకు బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో పార్టీ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు లావూడ్యా శ్రీనునాయక్, మండల సెల్ అధ్యక్షుడు మాలోతు శంకర్‌నాయక్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బాణోతు బాలు, రవీందర్, బాషానాయక్ తదితరులు ఉన్నారు.

సర్వే వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి

- ఆర్డీఓ శ్రీనివాసులు


శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ డివిజన్ వ్యాప్తంగా జరుగుతున్న కుటుంబ సమగ్ర సర్వేలో సేకరించిన వివరాలను డేటా ఎంట్రీ ఆపరేటర్లు పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆర్డీఓ శ్రీనివాసులు కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు మాస్టర్ ట్రైనీలతో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున్‌రెడ్డి, మాస్టర్ ట్రైనీలు విజేతరెడ్డి, విజయ్, డివిజన్‌లోని తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

మారుమోగిన అయ్యప్ప నామస్మరణ


పడి పూజ నిర్వహిస్తున్న గురుస్వాములు


పూజలో పాల్గొన్న మాలధారులు, భక్తులు

నేరేడుచర్ల : స్వామియే శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప నామ స్మరణతో నేరేడుచర్ల పట్టణం మారుమోగింది. బుధవారం పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మహా పడి పూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత రామాలయం నుంచి కలశాలను మేళాతాళాలు, మంగళ వాయిద్యాలతో ఆయ్యప్ప ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం గురుస్వాములు చిన్నపల్లి శ్రీనివాస్, చిట్యాల శ్రీను, ఐల శ్రీనులు.. అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొణతం కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్ పర్సన్ అలక సరిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు నాగవేణి, సాయి, లలిత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, నాయకులు నాగండ్ల శ్రీధర్, వల్లంశెట్ల రమేష్‌బాబు, వీరయ్య, సురేష్‌బాబు, జయబాబు, లక్ష్మారెడ్డి, కిశోర్, పూర్ణ చంద్రారెడ్డి, శంకర్, శంకర్‌రెడ్డి, గణేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దు : సీఐ


మోతె : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి



అనంతగిరి : మాట్లాడుతున్న సీఐ రజితారెడ్డి

మోతె : యువత సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట ఎస్పీ ఆదేశాల మేరకు మోతె మండలంలోని సిరికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాల నివారణపై విద్యార్థులను అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఇంటర్‌నెట్‌ను అవసరం మేరకే వినియోగించుకోవాలన్నారు. ఇతరులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలు తెలుపవద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మహిళలు, యువతుల వేధింపులపై 100కు డయల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు మామిడి శ్రీను, శ్రీనివాసచారి, దామళ్ల కోటేశ్వరరావు, రాంబాబు, సురేష్‌కుమార్, మారయ్య, సాజిద్, గోవర్ధన్ రెడ్డి, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

అనంతగిరి : మండల కేంద్రంలోని సన ఫార్మసీ కళాశాలలో బుధవారం జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు షీ టీమ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. మత్తు పదార్థాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్ నివారణపై పోలీసు శాఖ పటిష్టంగా పని చేస్తుందన్నారు. అనంతరం కళాబృందం చేత ప్రదర్శించిన ఆట, పాట ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ గోపిరెడ్డి, షీటీమ్ సిబ్బంది గోవింద్, యాకూబ్, సాయి జ్యోతి, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దు

నడిగూడెం : యువత మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని స్థానిక ఎస్ఐ జి.అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కరివిరాల మోడల్ స్కూల్‌లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మత్తు పదార్థాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి కళాశాల, ఉన్నత పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనార్థాలు

మఠంపల్లి : గంజాయి, మత్తు పదార్థాల వినియోగంతో అనేక అనార్థాలు ఉంటాయని ఎస్ఐ రామాంజనేయులు అన్నారు. బుధవారం మఠంపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గంజాయి, మత్తు పదార్థాల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మఠంపల్లి : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ రామాంజనేయులు

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

నేరేడుచర్ల : సుప్రీం కోర్టు తీర్పును అనుసరిస్తూ ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఊట్కూరి భార్గవసైదులు అన్నారు. బుధవారం నేరేడుచర్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్లు 15 శాతం అమలు చేస్తే అందులో 10శాతం వరకు మాల సామాజిక వర్గానికి చెందినవారే ఉంటున్నారని, ఎస్సీ వర్గీకరణతో ఎస్సీల్లో ఉన్న 53 కులాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచ్చ శ్రీను, మండల ఉపాధ్యక్షుడు సిద్దపంగ రామకృష్ణ, నాయకులు పల్లె భాస్కర్, ప్రవీణ్, వెంకన్న, గోపాల్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల విలీనం ఆపాలని వినతి

భానుపురి (సూర్యాపేట) : అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేయడాన్ని వెంటనే ఆపాలని అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంపటి గురూజీ అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ఇన్‌చార్జ్ సీడీపీఓ విజయచంద్రికకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొన్ని కేంద్రాలలో చిన్నారులు ఎక్కువగా లేరనే సాకుతో సమీపంలోని వార్డ్ అంగన్‌వాడీ కేంద్రాలలో విలీనం చేయడంతో ప్రస్తుతం నిర్వహిస్తున్న కేంద్రాల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తంతెనపల్లి సుజాత, ఉపాధ్యక్షురాలు సుజాత, చంద్రకళ, రేఖ, మాధవి, ఉష, సైదమ్మ, సునంద, భాగ్యలక్ష్మి, జానకమ్మ, జహంగీర్ బీ తదితరులు పాల్గొన్నారు.

జరిమానాలు కట్టి.. మళ్లీ చోరీలు చేసి

- ఆర్లెగూడెంలో వరుస దొంగతనాలు
- జరిమానాలు విధించి వదిలేస్తున్న పెద్దమనుషులు
- అవకాశంగా మార్చుకుంటున్న దొంగలు

చిలుకూరు : దొంగతనాలకు పాల్పడుతున్న పలువురు వ్యక్తులు నేరం బయట పడగానే పెద్ద మనుషులను సంప్రదించి వారి సమక్షంలో జరిమానాలు కట్టి బయటపడుతున్నారు. ఈ సంఘటన చిలుకూరు మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో నిత్యకృత్యమైంది. బుధవారం తెలిసిన విశ్వసనీయ సమాచారం మేరకు.. ఆర్లెగూడెం గ్రామంలో కొన్ని నెలలుగా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం ప్రభుత్వ పాఠశాల వద్ద గల కిరాణ దుకాణంలో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన వ్యక్తులే చోరీ చేసినట్లు బాధితులు గుర్తించారు. కానీ వారిపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టేలోపే దొంగలు గ్రామంలోని పెద్ద మనుషులను సంప్రదించి పంచాయితీ పెట్టి రూ.40 వేలు జరిమానా కట్టించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఖమ్మంలో నివాసం ఉంటుండగా ఈ దొంగల ముఠానే ఖమ్మం వెళ్లి అతనిపై దాడి చేశారు. ఆ సమయంలోనూ పెద్ద మనుషులే మాట్లాడి వారికి రూ. 50 వేలు జరిమానా వేశారు. ఇటీవల గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌తో గ్రామానికి చెందిన పలువురి ట్రాక్టర్లలో బ్యాటరీలు చోరీకి గురైనట్లు తెలిసింది. అలాగే కవితా జూనియర్ కళాశాల వద్ద కూడా విద్యుత్ మోటార్లు అపహరించారు. ఇలా ఆయా ప్రాంతాల్లో జరిగిన పలు దొంగతనాలు కూడా ఈ వ్యక్తులే చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒక్కొక్కరికి రూ.30 వేలు జరిమానా..

ఇదిలా ఉండగా గ్రామ సమీపంలోని పొలాల్లో మోటార్‌ను మంగళవారం రాత్రి తొమ్మిది మంది దొంగిలించారు. ఈ విషయంపై కూడా పెద్ద మనుషులు పంచాయితీ పెట్టి ఒక్కొక్కరి వద్ద నుంచి దాదాపు రూ.30 వేలు చొప్పున రూ. 2.70 లక్షలు జరిమానా విధించి డిపాజిట్ చేయించారు. ఈ డబ్బును బాధిత రైతుకు ఇవ్వాలని నిర్ణయించారు. ఇలా గ్రామంలో దొంగతనాలు జరుగుతున్నా ప్రతిసారీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయకుండా పంచాయితీలో మాట్లాడడం ఏంటని పలువురు గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇలా చేస్తే దొంగలు ఇంకా రెచ్చిపోతున్నారని అంటున్నారు. ఈ విషయమై పోలీసులు స్పందించి దొంగతనాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.